# అక్రమ నిర్మాణాలపై "టాస్క్‌ఫోర్స్"

-సర్కిళ్ల వారీగా ప్రత్యేక టీంల ఏర్పాటుకు చర్యలు
-నోడల్ ఆఫీసర్లుగా డిప్యూటీ కమిషనర్లు
-సిసిపి పర్యవేక్షణలో పనిచేయనున్న బృందాలు




హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు జీహె చ్ఎంసీ సిద్ధమవుతుంది. ముఖ్యంగా ప్రతి సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జీ హెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం లో అక్రమ నిర్మాణాలు, వాటిని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా రావటంతో కమిషనర్ ఇలంబర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను నియమించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. గత ఐదునెలల్లో ఇప్పటి వరకు నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమాల్లో సుమారు 3500 ఫిర్యాదులు స్వీకరించగా, వీటిలో దాదాపు 2 వేల వరకు టౌన్ ప్లానింగ్ కు సంబంధించిన ఫిర్యాదులే ఉండగా అందులో అత్యధికం గా అక్రమ నిర్మాణాలకు సంబంధించినవి ఉన్నట్లు సమాచారం. ఈఫిర్యాదుల పరిష్కారానికి టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించినా, వారి పనితీరులో మార్పు రాకపోవటంతో కొద్దిరోజుల క్రితం వరకు జోనల్ స్థాయి వరకు అమలు చేసిన జోనల్ టాస్క్ ఫోర్స్ విధానాన్ని ఇప్పుడు సర్కిల్ స్థాయిలో అమలు చేసేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఇటీవల జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌లో జోనల్ కమిషనర్లతోమాట్లాడుతూ.. గతంలో జోనల్ లెవెల్లో ఉన్న టాస్క్ ఫోర్స్ టీమ్లు నిర్వీర్య మైన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు సర్కిల్ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని, ఆ టీంలల్లో ఎవరెవరిని భాగస్వాములను చేయాలన్న విషయంపై తనకు అభిప్రాయాలు పంపాలని ఆదేశించినట్లు తెలిసింది.

**నోడల్ ఆఫీసర్‌గా డిప్యూటీ కమిషనర్..**

సర్కిల్ స్థాయిలో ఏర్పాటు చేసే టాస్క్ ఫోర్స్ టీమ్‌కు స్థానిక డిప్యూటీ కమిషనర్ నోడల్ ఆఫీసర్‌గా నియమించి, జోనల్ స్థాయి నోడల్ ఆఫీసర్ బాధ్యతలను జోనల్ సిటీ ప్లానర్‌కు అలాగే మొత్తం సిటీకి నోడల్ ఆఫీసర్‌గా చీఫ్ సిటీ ప్లానర్ (సిపిపి) నియమిస్తే ఫలితాలుంటాయని కొందరు జోనల్ కమిషనర్లు కమిషనర్‌కు సూచించినట్లు సమాచారం. సర్కిల్ స్థాయిలో నియమించే టీమ్ సభ్యులు తమకు కేటాయించిన సర్కిల్లోని వివిధ ప్రాంతాల్లో జరిగే నిర్మాణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సదరు నిర్మాణం తీసుకున్న అనుమతుల ప్రకారంగానే జరుగుతుందా? నిర్మాణం జరుగుతున్న చోట ప్రమాద నివారణ చర్యలు అమలవుతున్నాయా? సెట్ బ్యాక్లు పాటిస్తున్నారా? లేదా? అన్ని విషయాలను పరిశీలించి, డిప్యూటీ కమి షనర్కు, డిప్యూటీ కమిషనర్ నుంచి జోనల్ సీపీకి నివేదికలను పంపనున్నట్లు తెలిసింది.

ఆ తర్వాత చీఫ్ సిటీ ప్లానర్ నుంచి కమిషనర్ వరకు రోజువారిగా వచ్చే నివేదికలను బట్టి ఆయా నిర్మాణాలపై యాక్షన్ తీసుకునే అవ కాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.




# హైదరాబాద్ వార్త

## ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం

-చారిత్రక మక్కామసీదులో అన్ని ఏర్పాట్లు
: సూపరిండెంట్ ఖాదర్ సిద్దిఖి
-పాతనగరంలో రంజాన్ మాసం సందడి
-కోట్లాది రూపాయల వ్యాపారాలు



చారిత్రక మక్కామసీదు మినార్



చార్మినార్, మార్చి 1 ప్రభాతవార్త : ఆకాశంలో నెలవంక కనిపించటంతో శనివారం రాత్రి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అయ్యింది. రంజాన్ నెలలో ముస్లింలు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. ఉపవాస సమయంలో ముస్లింలు కనీసం మంచి నీళ్ల కూడ ముట్టరు. రంజాన్ నెలలో పేదలకు దానధర్మాలు చేస్తారు. కాగా శనివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శన మివ్వటంతో ముస్లింలు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేసుకునా న్నరు. ఆదివారం నుంచి నెల రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. ప్రతీ రోజు సాయంత్రం ఉపవాస దీక్షలు విడిచి పెట్టిన అనంతరం ముస్లింలు బంధు మిత్రులతో కలిసి ఇఫ్తార్ విందులలో పాల్గొంటారు. రంజాన్ మాసం మనశ్శాంతి పొందే మాసం. రంజాన్ నెల పరమ పవిత్రమైనది. ఈ మాసంలో ముస్లింలు ఎంతో నిష్టతతో నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలలో పాల్గొంటారు. హైదరాబాద్ పాతనగరంలో కోట్లాది రూపాయల వ్యాపారాలు జరుగుతాయి. ముస్లిం లురంజాన్ నెలలో పెద్ద ఎత్తున దాన ధర్మాలు చేస్తారు. చార్మినార్‌కు దగ్గరలో ఉన్న చారిత్రక మక్కామసీదు, జమామసీదు, చౌక్ మసీదుతో పాటు పాతబస్తీ లోని అన్ని మసీదులను అందంగా తీర్చిదిద్దారు. రంజాన్ మాసం సందర్భంగా మక్కామసీదులో అన్ని ఏర్పాట్లు చేశామని మక్కామసీదు సూపరిండెంట్ ఖాదర్ సిద్దిఖ్ వెల్లడించారు. ముస్లింలకు రంజాన్ చాలా పెద్ద పండుగ కావటంతో వ్యాపారులు పెద్ద ఎత్తున రంజాన్ పండుగకు సంబంధించిన వస్త్రాలు, రెడిమెడ్ దుస్తులుతో పాటు ఇతర వస్తువులను దిగుమతులు చేశారు. మసీదులలో పరిచే తివాచీలను మహ్మద్ క్యాప్‌మార్ట్‌తో పాటు పలు షాపులలో అమ్ముతున్నారు. రంజాన్ గాజుల విక్రయాలకు ఎంతగానో ప్రసిద్ధిగాంచిన చార్మినార్ సమీపంలోని లాడ్‌బజార్ గాజుల దుకాణాల యజమానులు రంజాన్ మాసంలో ప్రత్యేకంగా గాజులు తయారు చేయించారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో ప్రీతితో హాలీంను తింటారు. నెల రోజుల పాటు హాలీంకు పెద్ద ఎత్తున గిరాకీ ఉంటుంది. పాతబస్తీలోని శాలిబండ, ఫలక్‌నుమా, చార్మినార్, మదీనా, మొగల్‌పుర, బహదూర్‌పుర, భవానీనగర్, జహానుమా, మీర్‌చౌక్‌తో పాటు పలు ప్రాంతాలలోని హోటళ్ల యజమానులు ప్రత్యేకంగా హాలీం తయారు చేసి విక్రయించటానికి ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ పాతనగరంలో రంజాన్ మాసం సందడి నెలకుంది. కాగా శనివారం రాత్రి చారిత్రక మక్కామసీదులో జరిగిన ప్రార్ధనలలో పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## మణికొండ రవాణా కార్యాలయంలో ఫ్యాన్సీ నెంబర్ల వేలం

- ఒక్క రోజే రూ.37లక్షల ఆదాయం
- కాసుల వర్షం కురిపించిన క్రేజీ నెంబర్లు

నార్సింగి, మార్చి 1 ప్రభాతవార్త : మణికొండలోని రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ కార్యాలయంకు శనివారం ఒక్క రోజే ఏకంగా రూ.37.లక్షల ఆదాయం వచ్చిందని డిటిసి సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారుల "ఫ్యాన్సీ నెంబర్ల" క్రేజీని రవాణా శాఖ అధికారులు "సొమ్ము" చేసుకున్నారు. ఎక్కడ వెళ్లినా అందరూ తమ కార్ల నెంబర్‌ను చూసి తమను గుర్తించాలన్న వాహనదారుల క్రేజీ రవాణా శాఖకు కాసుల వర్షంను కురిపించింది. వాహనదారుల ఆసక్తిని గుర్తించిన రవాణా శాఖ అధికారులు 1.మార్చి 2025.న మణికొండలోని రవాణా శాఖ కార్యాలయంలో ఫ్యాన్సీ నెంబర్ల వేలంపాట నిర్వహించారు. వందల సంఖ్యలో వాహనదారులు ఈ వేలం పాటలో పోటీ పడి తమకు కావాల్సిన నెంబర్లను దక్కించుకొని, సంబరాలు చేసుకున్నారు. ఈ సంవత్సరం ఫ్యాన్సీ నెంబర్ల ధరలు భారీ ఎత్తున పలికాయని అధికారులు వివరించారు. ముప్పా ప్రాజెక్ట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు సంబంధించిన వ్యక్తి (టిజి07పి9999) నెంబర్ కావాలని రూ.50.వేల ఫీజును ముందస్తుగానే చెల్లించి వేలం పాటలోకి దిగాడు. అలాగే వేలం పాటలో ఏకంగా రూ.9,36,999కు దక్కించుకున్నాడు. రవాణా శాఖకు మొత్తం రూ.9,86,999ను చెల్లించి తనకు ఇష్టమైన నెంబర్‌ను దక్కించుకొని మురిసిపోయారు. అలాగే (టిజి07ఆర్0009)ను కెఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌కు చెందిన వ్యక్తి రూ.50.వేల ఫీజు చెల్లించి వేలం పాటలో పాల్గొని ఏకంగా రూ.7లక్షలకు దక్కించుకున్నాడు. రవాణా శాఖకు మొత్తం రూ.7,50.వేలను చెల్లించాడు. ఇలా వాహనదారులు రూ.10.వేల నుంచి మొదలు కొని 9,86,999 వరకు వేలం పాటలో తమకు ఇష్టమైన వాహనాల నెంబర్లను దక్చించుకున్నారు. ఇష్టమైన నెంబర్లు దక్కించుకున్న వారు యుద్ధంలో విజయం సాధించి వచ్చిన వారిలా తమ అనుచరగణంతో కలిసి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి

-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త: పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదోతరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చ్ 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే వార్షిక పరీక్షలకు 358 సెంటర్లలో మొత్తం 77701 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, అలాగే చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించామన్నారు. అదేవిదంగా ఏర్పాటు చేసే 28 రూట్లలో రూట్ అధికారులను కేటాయిం చామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ముందుగా శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందుగా మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా కేంద్రాలలో నిరంతర విద్యుత్ , తాగునీరు ఉండేలా చూడాలని మూత్రశాలల సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్షా కేంద్రాలకు తరలించాలని అన్నారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ దృష్ట్యా ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని ప్రతి సెంటర్ కు ఇద్దరు కానిస్టేబుళ్ళతో తప్పక బందోబస్తు నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండాలని, ఆశా వర్కర్‌లను నియమించాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో డిఆర్ఓ ఈ.వెంకటాచారి, డీఈఓ ఆర్ రోహిణి, డి ఎం హెచ్ ఓ డా. వెంకటి, అదనపు డిసిపి రవీందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏడిఈ ప్రార్ధన, డిప్యూటీ ఆర్ఎం భీమ్ రెడ్డి, పర్యవేక్షకులు జహీరొద్దీన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఐఎం పార్టీ 67వ వ్యవస్థాపక దినోత్సవం



ఎంఐఎం పార్టీ అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చార్మినార్, మార్చి 1 ప్రభాతవార్త : దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఎఐఎంఐఎం పార్టీ 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరిగింది. మార్చి నెల రెండవ తేదీన ఎంఐఎం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం జరగవలసి ఉందని అయితే రంజాన్ మాసం మార్చి నెల రెండవ తేదీ నుంచి ప్రారంభం కావటంతో మార్చి ఒకటివ తేదీన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పార్టీ పతాకాన్ని ఎగురు వేశారు. అనంతరం జరిగిన సభలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఎంఐఎం పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలు నుంచి ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు దారుసలాంలోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, బహదూర్‌పుర ఎమ్మెల్యేమహ్మద్ ముబీన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీలు మీర్జా రియాజుల్ హసన్ అఫెందీ, మీర్జా రెహ్మత్ బేగ్‌తో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా ఎంఐఎం పార్టీకి ఒక ఎంపి, ఇద్దరు ఎమ్మెల్సీ లు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆరుగురు మంది శాసన సభ్యులు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ఎమ్మెల్యే, మహారాష్ట్రలో ఒక ఎమ్మెల్యే, బిహార్‌లో ఒక ఎమ్మెల్యే, జిహెచ్ఎంసి పరిధిలో 44 మంది కార్పొరేటర్లు ఉన్నారు.


## ప్రజా సమస్యలపై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యులు

**ధర్నాచౌక్, మార్చి 1, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కేంద్ర కమిటీ సభ్యులు కే.శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ప్రారంభించిన అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదల, విద్య, వైద్యం ప్రైవేటీకరణ, నిరుద్యోగం, మద్యం, డ్రగ్స్, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, రైతులపై, కార్మికులపై జరుగుతున్న శ్రమదోపిడీ తదితర సమస్యలను ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు విస్మరించాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, తక్షణమే ఆ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకార్యక్రమంలో ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి పి.తేజ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి భరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు జానీభాషా, గంగాధర్ పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు తెలిపిన ఎంపీ ఈటెల రాజేందర్



రైతులతో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

దుండిగల్, మార్చి 1, ప్రభాతవార్త

దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ గ్రామంలో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.ఎస్ మల్లారెడ్డి అభ్యర్థన మేరకు నిరసన తెలుపుతున్న రైతులకు శనివారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మెడలు వంచి బీజేపీ పార్టీ, స్థానిక ఎంపీగా రైతుల పక్షాన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత 50 సంవత్సరాలుగా అదే జీవనాధారంగా మూడు తరాలు జీవిస్తు భూమితో ఎంతో అనుబంధం ఏర్పరచుకున్న రైతులు ఈరోజు అన్యాక్రాంతంగా ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా దౌర్జన్యంగా లాక్కోవడం బీజేపీ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, కొంపల్లి మాజీ కౌన్సిలర్ రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కార్పొరేటర్ మహేందర్, విజయలక్ష్మి, బీజేపీ నాయకులు ఆకుల మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, భాను గౌడ్, శ్రీధర్, యువమోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల విజయ్, వెంకటేష్ నాయక్, యశ్వంత్, విష్ణు, అఖిల్ గ్రామ ప్రజలు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## గోల్నాకలో విదేశీ యువతులతో వ్యభిచారం

-ముఠా గుట్టురట్టు చేసిన అంబర్‌పేట్ పోలీసులు

హైదరాబాద్, మార్చి1,ప్రభాతవార్త: విదేశీ యువతులతో వ్యభిచారం చేయిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయ్యింది. హైదరాబాద్ గోల్నాకలో విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ నిర్వాహకుడితోపాటు విటుడిని అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక జిందా తిలస్మాత్ వద్ద ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నిర్వాహకుడు తిమోతీ బార్చి (30)తో పాటు విటుడు లింగాల బాల్‌రెడ్డిని అరెస్టు చేశారు. అలాగే వ్యభిచారం చేస్తున్న ఉగాండాకు చెందిన నలుగురు యువతులతో పాటు కెన్యాకు చెందిన మరో యువతిని రెస్క్యూ హోమ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిర్వాహకుడు తిమోతీ బార్చి (30)ని లైబీరియా దేశానికి చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. లైబీరియా నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడ డిగ్రీ చదువుతున్నాడు. ఇదే సమయంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

## ఔటర్ సర్వీసు రోడ్డు మీద హిట్ అండ్ రన్

-ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

**గచ్చిబౌలి, మార్చి 1 ప్రభాతవార్త:** ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు మీద చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ ప్రమాదంలో ఒకరు మ ృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వేగంగా దూసుకువచ్చిన ఓ టిప్పర్ లారీ ముందు వెళ్తు న్న ద్విచక్రవాహాన్ని ఢీకొట్టగా, టిప్పర్ డ్రైవర్ లారీని ఆపకుండా సంఘటనా స్థలం నుంచి పారిపోయాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినా గులపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం మండలం ఉండూ రు గ్రామానికి చెందిన పిల్లి జ్ఞానేశ్వరరావు(37) మణికొండలో నివాసం ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పటాన్ చెరులో పనిచేసేందుకు మరో మేస్త్రీ టేకు మూడి మార్కొండేశ్వరరావుతో కలిసి శనివారం స్కూటీపై వెళ్తున్నాడు. ఉదయం 9 గంటల ప్రాంతంలో వట్టినాగులపల్లి ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు మీద ప్రయాణిస్తున్న వీరి వాహనాన్ని డంపింగ్ యార్డు సమీపంలో వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జ్ఞానేశ్వ రరావు అక్కడిక్కడే మ ృతిచెందగా, మార్కొండేశ్వరరావుకు తీవ్ర గాయాల య్యాయి. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా టిప్పర్‌తో అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకు న్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని జ్ఞానేశ్వరరావు మ ృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, గాయపడిన మార్కొండేశ్వరరావును ఆసుపత్రికి తరలించారు. టిప్పర్ లారీ కోసం స్థానికంగా ఉన్న సిసి కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## జైలుకి వెళ్లి వచ్చినా అదే తీరు

- చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు

**అత్తాపూర్ మార్చి1,ప్రభాతవార్త :** జైలుకి వెళ్లి వచ్చిన వారి తీరు మారలేదు... మహిళల మెడలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ జల్సాగా తీరుగుతున్న ముగ్గురు నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం....సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 2013-2016 వరకు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న చంద్రయణగుట్ట బండ్లగూడకు చెందిన మీర్ ముస్తాఫా అలీ (43),ఎ2 రాజేంద్రనగర్ ఎంఎండికి చెందిన షేక్ ఖయ్యూమ్ (38),ఎ3 చంద్రయణ గుట్ట బండ్లగూడకు చెందిన జకియ సుల్తానా (52)లను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఫిబ్రవరి 25న శివరాంపల్లి బస్తీలో ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుడుంగా నకిలీ నెంబర్ ప్లేట్ గల హోండా యాక్టివా స్కూటీపై మాస్కు ధరించి వచ్చిన నిందితులు మెడలో చైన్ లాక్కొని పరారు అయ్యారు. దింతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నింధితులను అరెస్టు చేశారు. అయితే నిందితులపై ఇంతక ముందే హైదరాబాద్ సీటి, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధలో పలు చైన్ స్నాచింగ్ కేసుల్లో జైలు వెళ్లి బెయిల్‌పై బయటకి వచ్చి మళ్లీ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని 17.5 గ్రాముల బంగారు గొలుసు, ఒక యాక్టివ్ స్కూట్, 60వేల రూపాయలను స్వాధీనం చేసుకొ ని రిమాండ్ తరలించారు. ఈ కేసులో చకచక్యంగా వ్యవహరించిన రాజేంద్రనగర్ జోన్ డిసిపి నర్సింహ, డిసిపి క్రైమ్స్, సైబరాబాద్ శ్రీనివాస్, ఎసిపి ,అత్తాపూర్ ఎస్‌హెచ్ఓ రవిలను సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మోహంతి అభినందించారు.

## విద్యార్థులకు సైన్స్‌ఫేర్ ఎంతో అవసరం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట, మార్చి 1 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, మేదా శక్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఫేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శనివారం గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను ఆయన ప్రారంభించారు.

**1వ వార్డు బాపూజీ నగర్‌లో . . .**

కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని అశోక గార్డెన్‌లో ఏర్పాటు చేసిన 5వ ఎడిషన్ ప్రాపర్టీ షోను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రారంభించారు.

## అంబర్‌పేటలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త**

అంబర్‌పేటలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సేవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కుట్టుమిషన్‌కు పూజలు నిర్వహించారు. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ డిఐ మల్లీశ్వరి ముఖ్య అతిథిగా హాజరై పలువురు టైలర్ల ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త చందర్ పాల్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## సరోజ్ కుమార్‌ను సన్మానించిన శ్రవణ్ కుమార్

**పేట్ బషీరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల సరోజ్ కుమార్ కాలె (ఐ క్లీన్) ఇంటర్ గ్రేటెడ్ క్లినోరమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసే రిటైర్మెంట్ అయిన సందర్భమును పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి డి.సి.సి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ అభినందించి, వారిని సన్మానించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు పనిచేసే రిటైర్మెంట్ పొందుతున్న సరోజ్ కుమార్‌కి ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ఆర్థిక అభివృద్ధి మనస్ఫూర్తిని కల్పించాలని ఆ భగవంతున్ని ఈ సందర్భంగా కోరారు.

## రంజాన్ మాసం ముస్లిం సోదరులకు పవిత్రమైంది

### -ఎమ్మెల్యే ముఠాగోపాల్



ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహాలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 1 ప్రభాతవార్త:** రంజాన్ మాసం ముస్లిం సోదరలకు అతి పవిత్రమైందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మసీదులు ఉండే ప్రాంతాలతో పాటు ముస్లీంలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఎటువంటి ఇబ్బందులుకలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముస్లింసోదరులకు పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే ఉపవాసాలు చేపట్టిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ నగర్లోని బైట్ ఫుడ్ స్క్వేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాలీమ్ స్టాల్ ను ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహాలు ప్రాంభించారు. రంజాన్ మాస ప్రారంభమైన సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహాలును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరలకు అతి పవిత్రమైందని అన్నారు. రంజాన్ మసంలో ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులో సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యమంలో నిర్వాహకుడు జావిద్, ప్రకాశ్ , బిఆర్ఎస్ నాయకుడు శ్యామ్ యాదవ్,. తదితరలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర



గాయత్రినగర్‌లో ప్రజా సమస్యలడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

**యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త**

ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ ఇండోర్ స్టేడియం, సున్నం చెరువు పార్కు, వాటర్ ట్యాంకు పార్కు, ఉమెన్స్ పార్కు, అబ్దుల్ కలాం పార్కు, ఆర్‌కె సొసైటీ బస్తీ దవాఖానా, రాజీవ్‌గాంధీనగర్, సబ్దార్‌నగర్ బస్తీలలో స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్‌ల బస్తీల కాలనీలలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డియి శంకరయ్య, ఏయి రంజిత్, డివిజన్ ఎమ్‌బీఆర్ఎస్ లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్, జ్ఞానేశ్వర్, కొండం సంపత్‌రెడ్డి, సంజీవ రెడ్డి, సయ్యద్ రియాజ్, అబ్దుల్ హమీద్, మాదవాచారి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ముత్యాల దుర్గ, మనెమ్మ, పాల్గొన్నారు.

## 39 మంది శానిటరీ జవాన్ల బదిలీ

**హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త:**

జీహెచ్‌ఎంసీ పరిధిలో 139 మంది శానిటరీ జవాన్లను బదిలీ చేస్తూ జీహెచ్ ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. 30 సర్కిళ్లకు సంబంధించిన 139 మందిని బదిలీ చేసినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో మొత్తం 269 మంది శానిటరీ జవాన్లు పనిచేస్తుండగా అందులో 5 సంవత్సరాలు పైబడి ఒకే సర్కిల్ లో పనిచేస్తున్న 139 మంది శానిటరీ జవాన్లను తమ రిక్వెస్ట్ పై వారికి కావాల్సిన సమీప సర్కిళ్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## అదృశ్యమైన వివాహిత ఆచూకి కోసం గాలింపు

**పేట్ బషీరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త**

భర్తతోపాటు పిల్లలను వదిలిపెట్టి ప్రియుడుతో కలిసి వెళ్లిన వివాహిత ఆచూకి కోసం పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాకు చెందిన మిరియంపల్లి పేరయ్య కుమారుడు గోపి (25 )ను కంప్యూటర్ ట్రైనింగ్ కొరకు హైదరాబాద్‌కు పంపాడు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ నేర్చుకుంటున్నాడు. ఓ యాప్‌లో గోపికి వరంగల్ జిల్లా బావోజిగూడెంకు చెందిన ఇద్దరు పిల్లల తల్లి సుకన్య (30) పరిచయం అయింది. వీరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకొనే వారు ఇది గమనించిన భర్త జయరాజ్ సుకన్యను మందలించాడు. గత నెల 5వ తేది సుకన్య భర్త పిల్లలను వదిలి గోపిని కలవడానికి నగరానికి వచ్చింది. ఇద్దరు కలసి గోపికి చెందిన బైక్ నెంబరు ఏపీ 39 జేఎఫ్ 0742 మీద మేడ్చల్ ఆక్సిజన్ పార్కుకు వచ్చారు. వీరిపై నిఘా ఉంచి వెంబడించిన భర్త జయరాజు వీరిని అడ్డగించాడు. సుచిత్రలో బైక్‌ను వదిలి పరారయ్యారు. భర్త బైక్ ను తీసుకొని పేట్‌బషీరాబాద్ పియస్‌లో పిర్యాదు చేసాడు. కేసు నమోదుచేసుకున్న పోలీ సులు దర్యాప్తు ప్రారంభించారు. బైక్ నెంబరు ఆధారంగా గోపి తండ్రి పేరయ్యను శనివారం స్థానిక పోలీసులు పిలిపించి ఆరా తీశారు.

## పార్కు స్థలంను కబ్జా నుంచి విడిపించాలని ఎమ్మెల్యేకు వినతి

**- రూ.30.లక్షలు పెట్టి పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే**
**- ఎమ్మెల్యే స్పందన పట్ల కాలనీ వాసులు సంతోషం**



పార్కు స్థలాన్ని కాపాడాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, కాలనీ వాసుల దృశ్యం

**నార్సింగి, మార్చి 1 ప్రబాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని భవానీ నగర్ కాలనీలో ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చెర నుంచి విడిపించాలని మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, కాలనీ వాసులు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో శిశుమందిర్ పాఠశాల సమీపంలో భవానీ నగర్ కాలనీని ఏర్పాటు చేశారని, వెంచర్ చేసిన సమయంలో దేవాలయానికి, పార్కుకు, ఓపెన్ స్పేస్‌కు అని మూడు ప్రాంతాలను వదిలిపెట్టారని వివరించారు. ఇప్పుడు భూముల ధరలు భారీగా పెరుగడంతో పార్కుకు కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఇతరులకు అమ్మివేశారని పేర్కొన్నారు. దీంతో స్థానిక కాలనీ వాసులు అందరూ కలిసి అడ్డుకునే ప్రయత్నం చేసినా సదరు కబ్జాదారులు వినలేదని, దీంతో పార్కు స్థలాన్ని కాపాడాలని కోరుతూ కాలనీ ప్రతినిధులు నన్ను సంప్రదించారని వివరించారు. నేను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పార్కు కబ్జా భాగోతం తెలిపేందుకు కాలనీ వాసులతో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. వినతిపత్రం చదివిన తరువాత ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పార్కు స్థలంను కాపాడి తీరుతామని కాలనీ వాసులకు హామీనిచ్చారు. వెంటనే బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్‌కు ఫోన్ చేసి భవానీ కాలనీలో ఉన్న పార్కు స్థలంను రూ.30.లక్షల వరకు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని, కాలనీ వాసులందరికి ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందన పట్ల భవానీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఇంత వేగంగా స్పందించే గుణం ఉండడం వల్లనే ప్రకాశ్‌గౌడ్ వరుసగా నాలుగో మారు విజయం సాధించారని, ఐదో సారి కూడా ఆయననే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు చేసిన సహకారం మరువబోమని ఇద్దరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని కాలనీ వాసులు పేర్కొన్నారు. వెంచర్లలో వదిలేసిన ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలను కబ్జా చేసేందుకు యత్నించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సాగర్‌గౌడ్ కోరారు.

## పాషా కాలనీ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**- రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే**
**- అండగా ఉంటామని భరోసా ఇచ్చిన నాయకులు**



పాషా కాలనీ అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరుల దృశ్యం

**నార్సింగి, మార్చి 1 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పాషా కాలనీ అగ్ని ప్రమాద బాధితులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరామర్శించారు. ఒకే కుటుంభంలో ముగ్గురు దుర్మరణం చెందడంతో ఆ కుటుంబ సభ్యులంతా షాక్‌లో ఉన్నారు. శనివారం బాధితుల ఇంటికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇతర కాంగ్రెస్ నాయకులు వచ్చి ధైర్యంగా ఉండాలని, మీకు అండగా ఉంటామని హామీనిచ్చారు. రూ.లక్ష ఆర్థిక సహాయం కూడా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాద ఘటనలో మీ కుటుంబ సభ్యులు ముగ్గురు మృతి చెందడం మమ్ములను కలిచి వేసిందన్నారు. మీ కుటుంభాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే స్పష్టమైన హామీనిచ్చారు. తాళ్లు, నిచ్చెనల సహాయంతో స్థానిక ప్రజలు సాహసం చేసి పై అంతస్థులో ఉన్న వారిని కాపాడిన తీరు ఆకట్టుకుందన్నారు. ఇలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఇరుగు, పొరుగు ప్రజలు మరింత వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తరపున మీకు సహాయం అందేలా నావంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంభాన్ని పరామర్శించిన వారిలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణగౌడ్, మణికొండ మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, సీనియర్ నేతలు అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, బషీర్, బుద్దోలు శ్రీరాములు, వసంత్ కుమార్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## భయం వీడి..పట్టుదలతో చదవాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**-షేక్‌పేట్ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో "రాత్రి బస"**
**-విద్యార్థులతో ఇష్టాగోష్టి..స్టడీ అవర్స్ పరిశీలన**



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్

**హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త:**

పరీక్షలు అంటే భయం వీడి పట్టుదలతో చదవి మెరుగైన ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు, తమ ఊరికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈమేరకు శుక్రవారం రాత్రి షేక్ పేట్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని తద్వారా లక్ష్యం మేరకు ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. గత సంవత్సరం లాగానే ఎస్ఎస్‌సి ఇంటర్మీడియట్ పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి బస చేశారు. విద్యార్థుల స్టడీ అవర్స్ తీరును గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. దీంతోపాటు నిద్రించే సమయంలో విద్యార్థులతో మాట్లాడుతూ భయం వీడాలని, పరీక్షల సమయంలో మానసిక ఆందోళన పడవద్దని పరీక్షలు ప్రశాంత వాతావరణం లో రాయాలన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ ఇష్టా గోష్టిగా మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకొని వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇతర వసతులను పరిశీలించారు. అన్ని తరగతి గదులను, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పర్యవేక్షించారు. వంటలను అందించ గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈకార్యరకమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. బాలస్వామి, అధ్యాపకులు వి. పాండు, వెంకట నారాయణ, త్రిపాఠి, రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## షియా ముస్లింలకు గవర్నర్ కోట ఎమ్మెల్సీ ఇవ్వాలి

**-షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ డిమాండ్**




సమావేశంలో మాట్లాడుతున్న ఇదాయత్ అలీమీర్జా తదితరులు

**హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త:**

షియా ముస్లింలకు గవర్నర్ కోట ఎమ్మెల్సీ ఇవ్వాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షులు ఇదాయత్ అలీ మీర్జా.. మాట్లాడుతూ హైదరాబాదులో షియా ముస్లింలు దాదాపు 12 లక్షల మంది ఉన్నారని కానీ తమ సామాజిక వర్గం నుంచి రాజకీయంగా ఎలాంటి ప్రాతినిధ్యం లేదన్నారు. ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్లు సైతం ఒక వర్గానికి చెందినవారే లబ్ధి పొందుతున్నారని అన్నారు..గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి షియా ముస్లింలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని, వివిధ పదవుల్లో అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం తమ కోసం ప్రత్యేకంగా పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా విద్యాసంస్థల నెలకొల్పడానికి స్థలాన్ని కేటాయించాలన్నారు. అలాగే హుస్సేనీ భవన్ నిర్మించాలని.. అంతే కాకుండా షియా వర్గానికి సంబంధించి మసీదులు, అషుర్ ఖానాలు , గ్రేవ్ యార్డ్స్ పునరుద్ధరించి తమ భూములను పరిరక్షించాలని కోరారు. ఈసమావేశంలో సంస్థ చైర్మన్ షబ్బీర్ అలీ మీర్జా, సీఈఓ షకీల్ హైదర్, కన్వీనర్ హైదర్ రజా నక్వీ, రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ హుస్సేన్, ,అధికార ప్రతినిధి అక్బర్ అలీ మీర్జా, ఉపాధ్యక్షుడు ఆబిద్ హుస్సేన్, సయ్యద్ అజ్గార్ అలీ ఖాన్, షబ్బీర్ హసన్ ఖాన్, హసన్ అలీ ఖాన్ ,అహ్మద్ సయ్యద్ హుస్సేన్, ఆసన్ అలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## జివో నెంబరు 550 ప్రకారం మెడికల్ పిజీ సీట్లు బిసిలకు కేటాయించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వి.ఈశ్వరయ్య. చిత్రంలో చిరంజీవులు, శ్రీనివాస్‌గౌడ్

**సైఫాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** జివో నెంబరు 550 ప్రకారం బిసి విద్యార్థులకు మెడికల్ సీట్లు కేటాయించకుండా పాలకులు కుట్ర చేస్తున్నారని ఆల్ ఇండియా బిసి ఫెడరేషన్ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. శనివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విశ్రాంత ఐఎఎస్ అధికారి చిరంజీవులుతో కలిసి మాట్లాడుతూ ప్రతి ఏడాది 300 మంది బిసి విద్యార్థులకు మెడికల్ పిజీ సీట్లు దక్కటం లేదని, 2014 నుంచి ఇలాగే కొనసాగుతున్నదని, ప్రక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు జరుగుతున్నా తెలంగాణలో అమలు జరగకపోవడం దారుణమన్నారు. ఓపెన్ కేటగిరిలో ఎవరు ఎక్కువగా డబ్బులు ఇస్తున్నారో వారికే సీట్లు కేటాయిస్తున్నారని, మెరిట్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మెరిట్ ఆధారంగా ఎస్సీ,ఎస్టీ,బిసి విద్యార్థులకు సీట్లు కేటాయించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికి తెలంగాణలో అమలు జరగడం లేదని, దీంతో బిసి వైద్యులు స్పెషలిస్టులు కాకుండా మిగిలిపోతున్నారని, అంతేకాకుండా వారు నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నామన్నారు. ప్రభుత్వం 48 గంటల్లోగా 550 జివో అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయకపోతే సహించేది లేదని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలతో కలిసి ఒక భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఆపైన జరిగే పరిణామాలు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.బి.విజయభాస్కర్ తదితరులు పాల్గొనా న్నరు.

## మాదిగ అమరవీరులకు పలువురి నేతల నివాళి



నార్సింగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమర వీరులకు జోహార్లు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుల దృశ్యం



మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న ముక్కెర్ల లాలయ్య

**నార్సింగి, మార్చి 1 ప్రభాతవార్త :** తరతరాలుగా మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై అలుపెరుగని పోరాటాలు చేసి, ప్రాణత్యాగాలు చేసిన "మాదిగ అమర వీరులకు" నార్సింగి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు జోహార్లు అర్పించారు. ఖానాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పెద్దపులి శంకర్ నాయకత్వంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెద్దపులి కృష్ణ, ఎమ్మార్పీఎస్ గండిపేట మండల ఇంచార్జి పి.గణేష్‌లు మాట్లాడుతూ సమాజ సేవలో కొన్ని శతాబ్దాల పాటు మాదిగలు పాల్గొన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాల నుంచి మాదిగల రిజర్వేషన్‌ల కోసం అలుపెరుగని పోరాటాలు చేసి విజయం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేందర్, దేవదాస్, రాఖేష్, బిక్షపతి, గోపాల్, రవీందర్, పోచయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**బాలంరాయిలోని**

**కంటోన్మెంట్, మార్చి 1 ప్రభాతవార్త:** ఎసీ స్వర్గీకరణ కోసం 30 సంవత్సరాలు సుదీర్ఘ ఉద్యమాలు చేపట్టి అసువులు బాసిన మాదిగ అమర వీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు పరశ రామ్ మాదిగ,మంద మధుకర్ మాదిగలు తెలిపారు. మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బాలంరాయిలోని బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎస్సీవర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు బ్యాగరి నర్సింహా, ప్రవీన్, మధు,గిరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేటలో**

**నిజాంపేట్, మార్చి 1, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల పోరాటం మరువలేనిదని మాదిగ జర్నలిస్టు ఫోరం సీనియర్ నాయకులు ముక్కెర్ల లాలయ్య అన్నారు. మార్చి 01 మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాయి నగర్లో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు మెద సంజీవ, మేడ శ్రీనివాస్, గణేష్, రాజు, చంద్రయ్య, ఉప్పలయ్య, కృష్ణ పాల్గొన్నారు.

## క్రీడారంగం అభివృద్ధిలో స్పోర్ట్స్ జర్నలిస్టుల పాత్ర కీలకం

**-హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సి.వి ఆనంద్**



డైరీ ఆవిష్కరిస్తున్న సి.వి ఆనంద్, సునీల్‌గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్,సంజయ్ తదితరులు

**హైదరాబాద్,మార్చి1,ప్రభాతవార్త:**

క్రీడా రంగం అభివృద్ధిలో స్పోర్ట్స్ జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఆయా ఆటల్లో క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రీడా పాత్రికేయులు కృషి ఎనలేనిదని అభిప్రాయపడ్డారు. స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జాట్) 2025 డైరీని సీవీ ఆనంద్‌కు ఆయన కార్యాలయంలో సంఘం ప్రతినిధులు బహూకరించారు. ఈ ఏడాదికి సంబంధించిన ముఖ్యమైన క్రీడలు, రాష్ట్ర క్రీడా సంఘాలతో కూడిన సమాచారంతో డైరీని రూపొందించిన ఎస్‌జాట్ బృందాన్ని సీవీ ఆనంద్ అభినందించారు. క్రీడాకారులు, క్రీడా పాత్రికేయుల కోసం ఎస్‌జాట్ నిర్వహించబోయే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జాట్ అధ్యక్షుడు ఆర్.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ దాస్ ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్.బి సంజయ్, సంయుక్త కార్యదర్శి సీహెచ్.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు జి.సునీల్ గౌడ్, ఎం.మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో అన్ని స్థానాల్లో ఆర్‌పిఐ పోటీ




పద్మకు నియామక పత్రాన్ని అందిస్తున్న శివనాగేశ్వర్‌గౌడ్

**సైఫాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ, మండల, పట్టణ, నగర, జిల్లాల్లో ఆర్‌పిఐ (అత్వాలే)ను బలోపేతం చేస్తామని, ఇందుకోసం సభ్యాత్వాన్ని వేగవంతం చేస్తామని భారత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్‌పిఐ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా పద్మను నియమించి, నియామక పత్రాన్ని అందించిన సందర్భంగా పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌గౌడ్ మాట్లాడారు. జిహెచ్‌ఎంసి ఎన్నికలతోపాటు అన్ని ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను ఎన్నికల భరీలోకి దించుతామన్నారు. గతంలో కంటే ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్‌పిఐ బలోపేతంగా ఉందని, ఎంతో మంది పార్టీ పట్ల అసక్తి చూపుతున్నారరని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, రత్నప్రసాద్, గోరఖ్‌నాద్, రోజారాణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర కీలకం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నరేంద్ర జాదవ్ తదితరులు

**ముషీరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర కీలకమైనదని మాజీ రాజ్యసభ సభ్యులు, ఆర్థికవేత్త, రచయిత డాక్టర్ నరేంద్ర దామోదర్ జాదవ్ కొనియాడారు. శనివారం దోమలగూడలోని ఏవీ కళాశాల ప్రాంగణంలో జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 55 సంవత్సరాల రాజ్యాంగ నిర్మాణం మరియు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్ర అనే అంశంపై జస్టిస్ కొండా మాధవరెడ్డి స్మారక ఉపన్యాస కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని రాజ్యాంగాల కన్నా భారత రాజ్యాంగం అత్యంత ప్రతిష్టాత్మకమైనదని అన్నారు. 1895 లో ప్రారంభమైన రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియ 55 సంవత్సరాల సుదీర్ఘ కాలం కొనసాగిందని తెలిపారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ పేరుతో ఒక ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి వంటి అనేక రంగాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొండా విశ్వేశ్వరరెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక వీరులను స్మరించుకోవటం ప్రతి భారతీయుడి బాధ్యత



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాల క్రిష్ణారెడ్డి

**చార్మినార్,మార్చి 1 ప్రభాతవార్త :**

ప్రజల క్షేమం కోసం నిరంతరం శ్రమించిన చారిత్రక అమర వీరులను స్మరించుకోవటం,వారి త్యాగాలను గౌరవించటం ప్రతీ భారతీయుడి బాధ్యత అని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాల క్రిష్ణారెడ్డి అన్నారు.లోకమాత అహల్యాబాయి హోల్కర్ మూడు వందల జయంతి వేడుకల సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో శనివారం జరిగిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 విద్యా రంగంలో వచ్చిన డిజిటల్ విప్లవం,నైపుణ్య భారత్ తన సామర్థ్యాన్ని నిరూపించుకోనున్నదని తెలిపారు. రానున్న 15 సంవత్సరాలలో భారత యువత తమ ప్రతిభతో ప్రపంచం ముంగిట కొత్త సవాళ్లను ఉంచనున్నారని ఆయన ఆశాభాన్ని వ్యక్తం చేశారు.అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ జాతీయ నిర్వాహక కార్యదర్శి గుంతా లక్ష్మణ్‌జీ మాట్లాడుతూ అహల్యా బాయి పాలనా విధానాలు,ఆమె చేసిన ప్రజోపయోగకరమైన కార్యక్రమాలు గురించి విద్యార్థులు తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్,సదస్సు నిర్వాహకులు ఎబిఆర్ఎస్ఎమ్ రాష్ట్ర బాధ్యులు ఆచార్య ఏలూరి యాదయ్య,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డా.ఆది రమేష్,డా.కమల సుధారాణి,డా.తిరుపతి,డా.చిత్తరంజన్,డా.ఆనంద్,డా.నాగరాజు,డా.క్రిష్ణవేణి,డా.శ్రీదేవి అధ్యాపకులు పాల్గొన్నారు.

## వనపర్తి నియోజకవర్గానికి ఎత్తిపోతల పథకం మంజూరు

**-ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డి.**

**బేగంపేట మార్చి 1,ప్రభాతవార్త**

వనపర్తి అసెంబ్లీ నియోజక వర్గంలోని ఆరు గ్రామాలు,13 గిరిజన తండాలలో దాదాపు నాలుగువేల ఎకరాలకు సాగునీరు అందించే కాశింనగర్ ఎత్తిపోతల(లిఫ్ట్ఇరిగేషన్)ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని,ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా,జిల్లెల చిన్నారెడ్డి తెలియజేసారు. దీంతో ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంఖుస్థాపన చేయనున్నారని అన్నారు.ఈ ఎత్తిపోతల పథకం కింద కాశింనగర్ ,జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తాయిపల్లి,అంజనగిరి గ్రామాలతో పాటు మరో 13 గిరిజన తండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల కాశింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేసారని అన్నారు.ఎన్నో ఏళ్లుగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పిందని చిన్నారెడ్డి హర్షం వ్యక్తంచేసారు. కాశింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథాకాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి,నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలియజేసారు.ఆదివారం వనపర్తిలో జరగను న్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు రైతులు,ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని చిన్నారెడ్డి కోరారు.

## రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అశ్విన్‌కుమార్



**అఫ్జల్‌గంజ్,మార్చి 1ప్రభాతవార్త:** నాంపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో విధులను నిర్వహిస్తున్న జె.అశ్విన్ కుమార్‌కు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు.ఈమేరకు అశ్విన్ కుమార్‌ను ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివా స్‌గుప్తను శాలువకప్పి పూలమాల వేసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు సకాలంలో వారి సమస్య లను పరిష్కరించడం ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుం దన్నారు.అంతేకాకుండా ప్రభుత్వ కూడా వారికి పదోన్నతలు కల్పిస్తారన్నారు.ఈకార్యక్రమంలో రాజు,అకాష్,శివ,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల మేధోశక్తి పెంపొందుతుంది : ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, లయోల వెంకట్రావు

**వనస్థలిపురం. మార్చి. 1.ప్రభాతవార్త :** వైజ్ఞానిక ప్రదర్శన ల ద్వారా విద్యార్థుల మేధోశక్తి పెంపొందుతుందని వనస్థలిపురం ఇన్స్పెక్టర్ సి.ఎచ్.శ్రీనివాస్ పేర్కొన్నారు. వనస్థలిపురం లో గల లయోల మాంటిస్సోరి స్కూల్ లో ఏర్పాటుచేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ను లయోల విద్యా సంస్థల చైర్మన్ రంగినేని వెంకట్రావు తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకించారు. నైట్రోజన్ సైకిల్, లేమన్ బ్యాటరీ, హ్యూమన్ హార్ట్, లేజర్ లైట్ సిస్టమ్, మానవుని జీర్ణక్రియ తదితర అంశాలు పలువురిని ఆకట్టుకున్నాయి. లయోల విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించి, విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీస్తామన్నారు. క్రమశిక్షణ తో కూడిన విద్యను విద్యార్థులకు అందించి, ఉత్తమ పౌరులు గా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ పాఠశాల లో చదివిన విద్యార్థులు నేడు వివిధ రంగాలలో ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో రంగినేని అనూప్ చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు : ప్రొఫెసర్ సుందర రాజు



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్.కె.ఎస్.వి.సుధాకర్.

**వనస్థలిపురం మార్చి1,ప్రభాతవార్త :** విద్యార్థులు ఇష్టపడి చదివి, శాస్త్రవేత్తలు గా దేశాభివృద్ధికి పాటుపడాలని ఎన్. జి.ఆర్.ఐ. చీఫ్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పి.వి.సుందర రాజు పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ ,వనస్థలిహిల్స్ కాలనీలో గల శ్రీఆదిత్య ఐ. ఐ. టి. కాన్సెప్ట్ స్కూల్ లో డాక్టర్.సి.వి.రామన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఎక్స్‌పో 2025 పేరిట పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గృహ నిర్మాణం, కిడ్నీ ల పనితీరు, రోబోట్, గ్రహ శకలాలు, బుజ్జికార్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సుందర్ రాజు మాట్లాడుతూ భవిష్యత్తు లో శాస్త్రవేత్తలు గా విద్యార్థులు రాణించాలన్నారు. ఇష్టపడు చదివితే అనుకున్నది సాధిస్తారన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ .కె.ఎస్.వి.సుధాకర్ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను తమ పాఠశాల విద్యార్థుల కు అందించి వారు ఎంచుకున్న రంగాలలో రాణించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో. ఆర్డినేటర్, మమత, ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాల ల విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన



ఉచిత వైద్యశిబిరం లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**వనస్థలిపురం. మార్చి1,ప్రభాతవార్త :** చింతల కుంట జనప్రియ హోమ్స్ కాలనీలో గల మహిళా మండలి భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీగోదా పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీవైష్ణవి జనప్రియ మహిళా మండలి సంయుక్త గా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, ఆలయ చైర్మన్ పి.వి. నర్సింహారావు లు శనివారం ప్రారంభిచారు. ఈ శిబిరంలో వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు, జనరల్ గైనకాలజి పరీక్షలు, బి.పి. షుగర్ ,డెంటల్, వినికిడి పరీక్షలు, నిర్వహించి తగిన సూచనలు, సలహాలు శిబిరానికి వచ్చిన వారికి ఇచ్చారు. ఈ శిబిరంలో అభినవ్ ఐ కేర్, లేజర్ క్లినిక్ మేడిపల్లి వైద్యులు, అపూర్వ సెంటర్ పర్ మెటర్నిటీ కేర్ మేడిపల్లి వైద్యులు, గ్లోబల్, అపోలో ఫార్మసీ ఎల్.బి.నగర్ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు పి.జ్యోతిసాయి, కె.రమ, పి. రాజేశ్వరి, పద్మావతి. మమత తదితరులు పాల్గొన్నారు.

### వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే బలాల



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట ,మార్చి 1, ప్రభాతవార్త:** మలక్ పేట్ నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి చేపట్టాలని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గానికి చెందిన జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖ, ఎంటామాలజీ విభాగానికి చెందిన అధికారులతో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సలాం షాహీద్, నాయకులు అబ్రర్, సైఫుద్దీన్ షఫీ, అధికారులు పీర్ సింగ్, రుద్ర శ్రీనివాస్, వెంకన్న, వినోద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థికి రాష్ట్రపతి నిలయం అవార్డు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** రాష్ట్ర నిలయంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలలో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినికి బహుమతి సాధించింది. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రిన్సిపల్ డా.కె. విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, డా.విశ్రీనివాసరావు, జె.విశ్వనాద్‌కుమార్, డా.ఆర్.చంద్రసాగర్‌లు ఆమె ను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రపతి నిలయంలో జరిగిన పోటీలలో ఉప్పల్‌కు చెందిన విద్యార్తికి బహుమతి రావడం అభినందనీయమన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారని, తమ కళాశాలకు చెందిన విద్యార్థినికి బహుమతి వచ్చిందని తెలిపారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



రామంతాపూర్ డివిజన్ అధ్యక్షునిగా ఎన్నికైన సంతోష్‌గుప్తను సత్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**రామంతాపూర్, మార్చి 1 ప్రభాతవార్త :** పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బిజెపి డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వంగాల సంతోష్‌గుప్త ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో బిజెపిని మరింత బలోపేతం చేయాలని, పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందని తెలిపారు. డివిజన్‌లో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్త మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీని కిందిస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రామంతాపూర్ డివిజన్‌లో పార్టీ నేతలను, కార్యకర్తలను కలుపుకుని పోతానని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, వంగాల సంతోష్‌గుప్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కక్కిరేణి చేతన, డివిజన్ మాజీ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, సీనియర్ నేతలు పోతగోని గోపాల్‌గౌడ్, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు బండి పద్మ, సీనియర్ నేతలు వల్లపు జగన్‌యాదవ్, బుర్ర రాజేశ్వర్, ముత్తినేని జగదీష్, చింతోజు శ్రీనివాసాచారి, రేవు నరసింహా, సంకూరి కుమారస్వామి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, శైలేందర్, శాగ రవీందర్, ఉలుగొండ నారాయణదాసు, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఉపేందర్ యాదవ్, పడిగం నగేష్, తుమ్మలి రవి, కె.లింగం, దర్శనాల సుధాకర్, కె.దయానందరెడ్డి, తాళ్ల మంగ, అంబటి భాగ్యలక్ష్మి, అరుణ, సుధ, స్వర్ణ షిండే, ఆర్యవైశ్య సంఘం నేతలు శంబుపాండయ్యగుప్త, అధ్యక్షుడు బోనగిరి శ్రీనివాసులుగుప్త తదితరులు పాల్గొన్నారు.

## జడ్జీల నియామకాలు చేపట్టి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి

**హయత్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** జడ్జీల తక్కువగా ఉండడంతో కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్నాయని, జడ్జీల నియామకాలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పిశాంకోషి అన్నారు. హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణ లో నూతనంగా నిర్మించిన బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోర్టుల్లో కేసులు కుప్పలుగా పేరుకుపోకుండా జడ్జీలు, న్యాయవాధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జడ్జీల నియామకానికి ఉన్న అడ్డంకులు తొలగేలా చూసి త్వరలోనే నియామకాలు చేపడతామన్నారు. హయత్‌నగర్ కోర్టు ఆవరణ విశాలంగా ఉందని న్యాయవాదులకు అన్ని సౌకర్యాలు సమకూరుతాయన్నారు. న్యాయమూర్తులు విజయసేనారెడ్డి, నర్సింగ్రావు మాట్లాడుతూ... హయత్‌నగర్ కోర్టులో సుమారు 8వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మూడు పోలీస్‌స్టేషన్ల పరిధికి సంబంధించిన కేసులు కోర్టుకు వస్తుండడంతో కొంతమేర ఇబ్బందిగా ఉన్నా... ఓపిక, సహనంతో పని చేస్తున్నామని తెలిపారు. నూతన బార్ అసోసియేషన్ కార్యాలయ నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు బిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాజడ్జీ శశిధర్‌రెడ్డి, మెజిస్ట్రేట్ సల్మా ఫాతిమా, శ్రీనాథ్, రవి, సంతోష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## నేటి సమాజంలో విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్యలు అవసరం : సామల రంగారెడ్డి



విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్టులు, సర్టిఫికెట్లను అందజేసిన సామల రంగారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** నేటి సమాజంలో విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్యలు అవసరమనీ తద్వారా వారిలో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, స్పార్క్ హై స్కూల్ చైర్మన్ సామల రంగారెడ్డి అన్నారు. చంపాపేట్ దుర్గా భవానీనగర్‌లోని స్పార్క్ హై స్కూల్‌లో సన్ పవర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థుల కు బెల్టుల గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రంగారెడ్డి కరాటే ప్రదర్శనలో ప్రతిభ చూపి వివిధ గ్రేడులు పొందిన విద్యార్థులకు బెల్టులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణనిప్పించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు కరాటే, కుంగ్ ఫూ తదితర మార్షల్ ఆర్ట్స్ విద్యల్లో శిక్షణనిప్పించి వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు. ముఖ్యంగా బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడానికి ముందుకు రావాలని ఆయన అన్నారు. చదువుతో పాటు విద్యార్థులందరూ మిగతా రంగాల్లో కూడా ప్రతిభ చాటాలని సామల పిలుపునిచ్చారు. ఈ కార్యమ్రంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగేందర్‌రెడ్డి, సన్ పవర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు చందర్‌రావు, ఎగ్జామినర్ కుమార్, కోచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.


### మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్‌లకు ఆత్మీయ సన్మానం



మాజీ మేయర్ పారిజాత, మాజీ కార్పొరేటర్ భారతమ్మలకు ఆత్మీయ సన్మానం చేసిన కాలనీవాసులు

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** ఇటీవల ఐదేళ్ళ పదవీ కాలం పూర్తి చేసుకున్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జెనిగె భారతమ్మ కొమురయ్య యాదవ్‌లకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్పొరేషన్ లోని 14వ డివిజన్‌లోనున్న అమెరికన్ టౌన్ షిప్ కాలనీ, డ్రీమ్ లేక్ సిటీ కాలనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కాలనీవాసులు మాజీ మేయర్, మాజీ కార్పొరేటర్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ కాలనీలను అభివృద్ధి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి, డివిజన్ యువ నాయకుడు జెనిగె శ్రీనివాస్ యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు సైదా సాబ్, సాయినాథ్, విశాల్, హుస్సేన్ భాయ్, సయ్యద్ ఆబిద్ అలీ, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

### శివాజీచౌక్ వద్ద మాదిగ అమర వీరుల దినోత్సవం



మాదిగ అమరులకు నివాళులర్పిస్తున్న బొర్ర రవి మాదిగ తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోనున్న శివాజీ చౌక్ వద్ద శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ, నాయకులు మస్కూరి శ్రీశైలం, సుధాకర్, అడ్డాకుల సురేష్, డికె నర్సింహ, గట్టు శ్రీనివాస్, ప్రకాశ్, మౌలాలి శ్రీను, రవి పాల్గొన్నారు.

### నేడు మీర్‌పేట్ ద్వారకామాయి పీఠంలో గణపతి, చండీ హోమం

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంతిహిల్స్ రోడ్ నెంబర్ 5లోనున్న శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో ఆదివారం లోక కళ్యాణార్థం ఆదివారం శ్రీ గణపతి, చండీ హోమాన్ని నిర్వహించనున్నారు. పూజ్యశ్రీ దత్త సిద్ధాంత ఆది కర్త గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో విశ్వ కళ్యాణం కోసం ప్రతిష్టాత్మకంగా ఈ హోమాన్ని తలపెట్టారు. ఈ మేరకు భక్తులు హాజరై దైవ అనుగ్రహంతో పాటు స్వామీజీ ఆశీస్సులు పొంది తరించాలని సాయిబాబా పీఠం వర్గాలు తెలిపాయి.


### అంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్థంభం ప్రతిష్టాపన



రామంతాపూర్ శ్రీ సంజీవ అంజనేయస్వామి ఆలయం ధ్వజ స్థంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** రామంతాపూర్ కామాక్షిపురంలోని శ్రీ శ్రీ సంజీవ అంజనేయస్వామి ఆలయంలో నందీశ్వర, నాగదేవత, సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయస్వామి సహిత ధ్వజ స్థంభ ప్రతిష్టాపన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు దేవత పూజలు, ధాన్యావాసం, అధివిసారిక, అవాహిత నోమామి, పంచసూక్త హోమాలు, శ్రయారివాసం, పుష్పాదివాసం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతోజు శ్రీనివాసాచారి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన, తిండేరు హన్మంతరావు, గోపాల్‌గౌడ్, దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటి అధ్యక్షుడు గాదె నాగరాజు, కోశాధికారి ఎస్.కృష్ణారావు, గణేష్‌చారి, బాలరాజు, అంజయ్య పటేల్, కె.శ్రీనివాసరావు, గడ్డం శంకర్‌గౌడ్, శ్రీహరి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌రాజు, యాదగిరి పాల్గొన్నారు.

### అధిక ఫీజులు వసూలు చేస్తున్న జీస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు.

**హయత్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని జీ హైస్కూల్ యాజమాన్యం నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతూ దోపిడీ చేస్తోందని ఆరోపిస్తూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపై ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యాశాఖ నిబంధనలను అనుసరించి ప్రతి ఏడాది 5-10 శాతం మాత్రమే ఫీజులను పెంచాల్సి ఉండగా... 30-50 శాతం వరకు ఫీజులను పెంచుతోందని తెలిపారు. ఫీజులు చెల్లించని విద్యార్థులను క్లాసు రూంలోకి రానీవ్వకపోవడం, పరీక్షలు రాయనీయకపోవడం వంటి చర్యలకు దిగుతోందని మండిపడ్డారు. విద్యాశాఖ నిబంధనలు జీస్కూల్‌కు వర్తించవన్నట్లు యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. అదేమని అడిగితే ఇష్టం లేకుంటే టీసీలు తీసుకుని వెళ్లిపోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టి జీస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

### మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



అల్లికల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధ్యక్షులు బొజ్జ రాఘవరెడ్డి...

**కుషాయిగూడ, మార్చి 1 ప్రభాతవార్త:** మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా అధిక వ్యవస్థ మెరుగుపడుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొజ్జ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యూట్ అల్లికల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణలు మహిళలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆర్థికంగా ఎదగడం ద్వారా కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కమలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొజ్జ రాఘవరెడ్డి, సీఎం రావు, సిహెచ్ మోహన్ రావు, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు పావని మణిపాల్ రెడ్డి మండా సురేష్ ఏవిఆర్ దత్తు లయన్ నాగన్న పెంటయ్య గౌడ్ జనార్దన్ గౌడ్ మధుసూదన్ రెడ్డి, మల్కు రమాదేవి ,సహదేవ, నవీన్ కుమార్ వంజరి ప్రవీణ్ కరిపే, దశరథ గౌడ్, మాధవరావు రామచంద్రావు ఆంజనేయులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### విలువలతో కూడిన విద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : కరెస్పాండెంట్



విజయ స్కూల్లో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం.

**కుషాయిగూడ, మార్చి 1 ప్రభాతవార్త:** విలువలతో కూడిన విద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని విజయ హై స్కూల్ కరస్పాండెంట్ కొప్పునూరు రాజేష్ పేర్కొన్నారు. విజయ హైస్కూల్ కాప్ర లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ కొప్పునూ రి రాజేశ్వర్, డైరెక్టర్ కె. వీణ, ప్రిన్సిపాల్ దేవినేనీ వెంగబాబు, ప్రధానోపాధ్యాయులు ఎం.వి.పద్మావతి గార్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డీ.వెంగబాబు గారు విద్యార్థులకు భవిష్యత్తు విజయాల కోసం కృషి చేయాలని సూచించారు. డైరెక్టర్ శ్రీమతి కొప్పునూరి వీణ గారు మాట్లాడుతూ...జీవితంలో స్కూల్‌లో నేర్చుకున్న విలువలు నిలుస్తాయని చెప్పారు. కరస్పాండెంట్ కె.రాజేశ్వర్ గారు విద్యార్థులు ఎక్కడున్నా తమ తల్లిదండ్రులు, గురువుల కు గౌరవం తెచ్చేలా జీవించాలని సూచించారు. విద్యార్థులు తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక నృత్యాలు, పాటలతో ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితం చేశారు.


### పార్కులను అహ్లాదకరంగా తీర్చిదిద్దాలి -కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ లోని పార్కులను అహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి హార్టికల్చర్ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్ని కాలనీల లోని పార్కుల నిర్వాహణ సరిగా లేదని, గ్రీనరీ లేదని వాటిని వెంటనే సరి చేయలని సూచించారు. కొత్త పూల మొక్కలను పార్కులలో నాటాలని, ఇప్పటికే ఉన్న మొక్కల నిర్వాహణ సరైన విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిరణ్, సూపర్‌వైజర్ మహేష్, సీతారాం, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిటి హాల్ పనుల పరిశీలన



కమ్యూనిటి హాల్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ జిఎ1 కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటి హాల్ విస్తరణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి కమ్యూనిటి హాల్‌ను కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వాటర్‌వర్క్స్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, రమేష్, ఆనంద్ పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

**హయత్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** ఇంట్లో నుంచి ఆఫీస్‌కు వెళ్లిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కన్పించకుండా పోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీకి చెందిన మలిపెద్ది శివశంకర్ రెడ్డి కుమారుడు అనురాగ్‌రెడ్డి(31) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఫిబ్రవరి 26న సాయంత్రం 4 గంటలకు అతను మాదాపూర్‌లోని ఆఫీస్‌కు ఉద్యోగ నిమిత్తం వెళ్లాడు. రాత్రి అక్కడే పీజీ హాస్టల్‌లో ఉంటానని, శుక్రవారం రాత్రి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. అతను రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు, స్నేహితులను విచారించారు. ఫలితం లేకపోవడంతో శివశంకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి : లచ్చిరెడ్డి



పార్కులో వాటర్ బోరింగ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. మార్చి. 1. ప్రభాతవార్త.** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ లో 15,00,000 లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్, వాటర్ బోర్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్ తో అభివృద్ధి చేస్తున్న పార్క్ లో ఈ రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు కొబ్బరికాయ కొట్టి వాటర్ బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 15,00,000 లక్షల రూపాయలతో పార్కు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడంలో సహకరించి కృషి చేసిన కార్పొరేటర్ గారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశలవారీగా కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని మరియు అతి త్వరలోనే పార్కు అభివృద్ధి పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బాలాజీ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, పవిత్ర, ప్రధాన కార్యదర్శి మహేష్ గుప్తా, జాయింట్ సెక్రటరీ యాదగిరి, రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, ట్రెజరర్ రఘుపతి రెడ్డి, అడ్వైజర్ మోహన్ రెడ్డి, శిలివీ శ్రీనివాసరావు మరియు పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, నాయకులు మహేష్ గౌడ్, బీజేవైఎం డివిజన్ కార్యదర్శి సురేష్ కుమార్ మరియు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : అబ్రార్



రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న అబ్రార్

**మలక్ పేట ,మార్చి 1, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని అజంపూర డివిజన్ ఎంఐఎం నాయకులు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్లోని మిలాద్ గల్లీలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్రార్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. డివిజన్ లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. ప్రతినిత్యం డివిజన్ లోని పలు ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అత్యదిక టాక్స్ కడుతున్నా నిధుల మంజూరేది -కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 1 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ, పూర్ణోదయ కాలనీలో యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డిలు పర్యటిస్తూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జంగం శ్వేత మాట్లాడుతూ యాకుత్‌పుర నియోజకవర్గంలో ఐఎస్ సదన్ డివిజన్ నుంచే అత్యధికంగా పన్నులు కడుతున్నప్పటికీ, డివిజన్‌లో అభివృద్ధి పనులకు మాత్రం తగినన్ని నిధులు మంజూరు కావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డివిజన్‌లోని పలు కాలనీలలో అంతర్గత రహదారులు, వీది దీపాలు, డ్రైనేజీ, పార్కుల మెయింటెనెన్స్ తదితర అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంలో అధికారులు పక్షపాతం చూపుతున్నారని కార్పొరేటర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డిసి మంగతాయారు. ఇంజనీరింగ్ విభాగం ఇఇ ఏకాంబరం, ఎఇ శిరీష, హార్టికల్చర్ మేనేజర్ యమున, హెచ్‌ఎ సుష్మ, ఎలక్ట్రికల్ ఎఇ సత్యనారాయణ, వాటర్‌వర్క్స్ మేనేజర్ మినాజ్, శానిటేషన్ ఎస్‌సి ఫక్రుద్దీన్, కాలనీవాసులు సిఎస్ రెడ్డి, అరవింద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువత స్వయం ఉపాధితో రాణించాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** యువత స్వయం ఉపాధితో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌కు చెందిన సీనియర్ నేత రోకటి నర్సింగ్‌రావు, భాను, సిద్దు, తదితరులు ఏర్పాటు చేసుకున్న స్కంద స్టాల్‌ను ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, వారికి తన వంతు చేయూత అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు కొత్త రామరావు, పిల్లి నాగరాజు, అన్య బాలకృష్ణ, నిరంజన్‌చారి, నవీన్‌చారి, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

### బీరప్పగడ్డ సమస్యల పరిష్కారానికి చర్యలు : బన్నాల ప్రవీణ్



బీరప్పగడ్డలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** బీరప్పగడ్డ బొమ్మల బస్తీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బీరప్పగడ్డ శివరాజ్ లేన్‌లో పలువురు బస్తీ వాసులతో కలిసి పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాలనీలో సిసి రోడ్డు లేవని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరినట్లు తెలిపారు. నల్ల పోచమ్మ ఆలయం నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు జగన్, సురేష్, జంగయ్య, కృష్ణ, సత్తమ్మ, నరసమ్మ, కళమ్మ, ఎల్లమ్మ, చంద్రకళ, పల్లవి తదితరులు పాల్గొన్నారు.